మద్యం దుకాణాల అడ్డా బైపాస్

రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రికి అత్యంత సమీపంలో గట్టినక ఉన్న బైపాస్ రోడ్డు మందుబాబుల క్షేత్రంగా మారిపోయింది. 200 అడుగులున్న విశాలమైన ఈ రహదారిని కూటమి సర్కారు తాగుబోతులకు రాసిచ్చేసినట్టుగా ఉంది. చీకటి పడితే చాలు ఈ రోడ్డుపై మందుబాబులు తాగడాలు..తాగి ఊగడాలు... నిత్యం అక్కడ తాగుబోతుల జాతరే... ప్రయాణికులు అటు వైపు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. పోలీసులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై స్థానికులు విమర్శిస్తున్నారు.

- రోడ్డుకు ఇరువైపులా ఇబ్బడిముబ్బడిగా మద్యం దుకాణాలు
- చీకటి పడితే ఆ రోడ్డులో ఇతరులెవ్వరూ వెళ్లలేని పరిస్థితి
- 6 గంటల తర్వాత ఆ వైపు కన్నెత్తి చూడని పోలీసులు



బైపాస్ రోడ్డులో ఇప్పటికే ఉన్న షాపు ముందు నిర్మాణం చేసిన షెడ్డు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సితార సెంటర్ నుంచి గొల్లపూడి మైలురాయి సెంటర్ వరకు గొల్లపూడి బైపాస్ రోడ్డుకు ఇరువైపులా బార్లు, వైన్ షాపులు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొచ్చాయి. నిన్న మొన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న ఈ రహదారి ఇపుడు జాతరను తలపిస్తోంది. సాయంత్రం 6 గంటలు దాటితే 200 అడుగుల వెడల్పయిన ఈ రోడ్డు తాగుబోతులు, వాళ్ల వాహనాలతో కుచించుకుపోతోంది. రోడ్లపైనే తాగడం, వీరంగం సృష్టించడం, వాహనాలకు అడ్డుపడడం నిత్య కృత్యంగా మారింది. సాయంత్రం అయితే పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

గొల్లపూడి బైపాస్ రోడ్డులో ఐరన్‌మార్కెట్, మహాత్మా గాంధీ హోల్ సేల్ మార్కెట్ వంటి పెద్ద మార్కెట్‌లు ఉన్నాయి. వీటిలో వందలాదిమంది కార్మికులు మూడు షిఫ్టుల్లో పనిచేస్తుంటారు. సితార సెంటర్ నుంచి హోల్ సేల్ మార్కెట్ వరకు కార్పొరేషన్‌లోనూ, అక్కడ నుంచి పంచాయతీ పరిధిలో ఉంది. దీంతో వైన్ షాపులు దక్కించుకున్న వారు ఈ రోడ్డును లక్ష్యంగా చేసుకుని షాపులు ఏర్పాటు చేశారు. అటు రూరల్‌లో షాపులు దక్కించుకున్న వాళ్లు సరిగ్గా కార్పొరేషన్, పంచాయతీ సరిహద్దులోనూ, కార్పొరేషన్‌లో షాపులు పొందిన వాళ్లు సితార సెంటర్ నుంచి హోల్ సేల్ మార్కెట్ వరకు షాపులు ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డులో డజనుకు పైగా మద్యం దుకాణాలున్నాయి. నగరంలో ఏ కార్యక్రమం జరిగినా ట్రాఫిక్ మొత్తం ఈ రోడ్డులోకి మళ్లిస్తారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు, విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలతో రద్దీగా ఉంటుంది. భవానీ భక్తులు సైతం గిరి ప్రదర్శన సితార సెంటర్ మీదుగా చేస్తారు. సితార సెంటర్‌కు అటు, ఇటు కొద్ది దూరంలోనే రెండు షాపులు ఏర్పాటు చేశారు. అక్కడికి సమీపంలో విద్యాధరపురం బస్ డిపోకు సమీపంలో ఓ వైన్ షాపు ఏర్పాటు చేశారు.

తాగడం.. ఊగడం.. వాహనాలకు అడ్డుపడడం..

గొల్లపూడి బైపాస్ రోడ్డు 200 అడుగుల వెడల్పుతో విశాలంగా ఉంటుంది. ఈ షాపులు ఏర్పాటు చేశాక.. అది కాస్తా తాగుబోతుల ఆక్రమణలతో కుచించుకుపోతోంది. ప్రతి షాపునకు ఇరువైపులా చికెన్ సెంటర్, సిగరెట్ కొట్లు వెలిశాయి. షాపులన్నీ సరిగ్గా మార్జిన్‌లో ఉండడంతో అక్కడికి వచ్చే వారంతా తమ వాహనాలను రోడ్డుపైన పెడుతున్నారు. సగానికి పైగా రోడ్డు ఈ వాహనాలతో నిండిపోతోంది. దీంతో ఆ రోడ్డులో వెళ్లే స్థానికులు నరకయాతన పడుతున్నారు. ఆర్టీసీ డిపో సమీపంలోని ఓ వైన్ షాపు నిన్నమొన్నటి వరకు ఓ ఇంట్లో ఉంది. లోపలికి ఉండడంతో ఇంటి ముందు రోడ్డు మార్జిన్‌కు నూతనంగా షెడ్డు ఏర్పాటు చేశారు. దాన్లో అమ్మకాలు సాగిస్తున్నారు. హోల్ సేల్ మార్కెట్ వద్ద రోడ్డుకు అటు ఇటు ఎదురెదురుగా షాపులు ఏర్పాటు చేశారు. రెండు షాపుల ముందు అటు ఇటు 200కు పైగా వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. ఇక అక్కడే మద్యం తాగి రోడ్డుపై వాహనాలకు అడ్డుపడడం నిత్యకృత్యమైంది. ఇటీవల రోడ్డు పక్కన మద్యం తాగుతున్న వ్యక్తిపై గుర్తు తెలియని వాహనం ఎక్కి అక్కడికక్కడే చనిపోయాడు. ఈ షాపుల్లో తాగిన కొందరు షాపు ఎదురుగా రోడ్డుపై దొర్లాడుతున్నారు.

కన్నెత్తి చూడని పోలీసులు

రోజూ సాయంత్రం నుంచి అమ్మకాలు ఊపందుకుంటున్నాయి. రాత్రి 6 గంటల తర్వాత కొందరు షాపుల వద్దే రోడ్లపై తాగేస్తున్నారు. ఆ సమయంలో రోడ్డులో ఒక్క పోలీసు కూడా కనిపించడం లేదు. కనీసం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై చర్యలు తీసుకోవడం లేదు. షాపుల నిర్వాహకులు తమకు ఏమీ పట్టనట్లు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అదేమంటే తమ షాపులు నిబంధనల ప్రకారమే ఉన్నాయంటూ వాదిస్తున్నారు. సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వివాహాలు, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎంజీ రోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో గురువారం ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో రకాల వస్త్రాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు వంటి వాటితో పాటు, పైథానీ సిల్క్ చీరలు, బెంగళూరు సాఫ్ట్ సిల్క్ చీరలు, బెంగాల్ బలూచారీ, జమదాని, టాంగైల్, ఢకాయ్ సిల్క్ వస్త్రాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 13 వరకు కొనసాగే ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పన్నులు చెల్లించని స్థలాల్లో నోటీసు బోర్డుల ఏర్పాటు



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో ఖాళీ స్థలాల పన్నులను వాటి యజమానులు వెంటనే చెల్లించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఖాళీస్థలాల పన్నులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని గురువారం నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా బకాయి ఉన్న స్థలాల వద్ద వీఎంసీ నోటీసు బోర్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మేరకు విద్యాధరపురం, దావు బుచ్చయ్య కాలనీ, రామకృష్ణాపురం, అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, గుణదల, కరెన్సీ నగర్, పటమట ప్రాంతాలోల ఖాళీ స్థలాల వద్ద వీఎంసీ నోటీసు బోర్డులు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఆయా స్థలాల యజమానులు 15 రోజుల్లోగా వారి పన్నులను చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, డ్రెయినేజీ చార్జీలు పెద్దమొత్తంలో బకాయి ఉన్న వారు కూడా వెంటనే ఆయా పన్నులు చెల్లించాలని, లేని పక్షంలో వారి నీటి, డ్రెయినేజీ కనెక్షన్లను నిలుపదల చేస్తామని చెప్పారు.

ఆకట్టుకున్న భక్తి సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ బృందం ఆలపించిన భక్తి సంగీతం విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గురువారం సాయంత్రం నవీన్‌కుమార్ బృందం పలు గీతాలను ఆలపించింది. నవీన్‌కుమార్‌కు కీబోర్డుపై నాగేశ్వరశర్మ, తబలాపై కోదండ రామయ్య చక్కటి సహకారం అందించారు. అనంతరం నవీన్‌కుమార్ బృందానికి ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ముగ్గుల పోటీలో డీఎస్ఎంసీ విద్యార్థినుల ప్రతిభ



భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ (డీఎస్ఎంసీ) హైస్కూల్ వారు నిర్వహించిన ముగ్గుల పోటీలో విద్యార్థినులు తమ ప్రతిభను చాటారు. గురువారం సాయంత్రం పాఠశాల సమీపంలోని తూనుగుంట్లవారి వీధిలో జరిగిన రంగవల్లుల పోటీలో సుమారు వంద మందికి పైగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ ముగ్గులతో పాటు సేవ్ ప్లానెట్, నాగలితో పొలం వెళుతున్న రైతు, చెరుకుగడలు, పొంగళ్ల వంటి పలు ఆకృతులలో వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. స్థానికుడు, నిత్య ఎడిబుల్ ఆయిల్ అధినేత చీతిరాల హరనాథ్ విజేతలకు బహుమతులు అందజేశారు. హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎమ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి మహిళా ఉత్సవ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు వచ్చే నెల 8 నుంచి 16వ తేదీ వరకు మహిళా ఉత్సవ్ – 2025ను నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

విద్యుత్ భారాలతో ప్రజలపై బాదుడే..బాదుడు

కార్పొరేటర్ సత్యబాబు



పెరిగిన విద్యుత్ బిల్లులు చూపిస్తూ సత్యబాబు ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

వించిపేట(విజయవాడపశ్చిమ): ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని బూటకపు హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గెలిచిన తరువాత విద్యుత్ భారాలతో ప్రజలపై బాదుడే.. బాదుడు అంటూ వసూళ్లకు పాల్పడుతున్నాడని కార్పొరేటర్, సీపీఎం నాయకుడు బోయి సత్యబాబు విమర్శించారు. నగరంలోని 50వ డివిజన్‌లో గురువారం పర్యటించిన ఆయనకు స్థానిక మహిళలు పెంచిన విద్యుత్ బిల్లులను చూపించి గగ్గోలు పెట్టారు. దీనిపై సత్యబాబు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరు నెలల్లోనే రూ.16 వేల కోట్లు భారం వేశారని విమర్శించారు. అసలు బిల్లు కన్నా అదనపు చార్జీల మోత ఎక్కువైందని ప్రభుత్వ తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేయడంలో ఏమాత్రం వెనుకాడని చంద్రబాబు నాయుడుకి ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుందన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, లేని పక్షంలో ప్రజలతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కోడి పందెం బరులు ధ్వంసం



అంబాపురం గ్రామ పరిధిలో గద్దర్లు తొలగిస్తున్న పోలీసులు



పాముల కాల్వ వద్ద బరిని ట్రాక్టర్‌తో దున్నిస్తున్న పోలీసులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రూరల్ గ్రామాలు, మామిడి తోటలు, పొలాల్లో ఏర్పాటు చేస్తున్న కోడి పందెం బరులను గురువారం పోలీసులు ధ్వంసం చేశారు. స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బరులను సిద్ధం చేస్తున్నారని కొత్తపేట సీఐ చిన కొండలరావుకు సమాచారం అందింది. దీంతో సీఐ కొండలరావు నేతృత్వంలో రూరల్ సెక్టార్ ఎస్ఐ శ్రీహరిబాబు, పోలీసు సిబ్బంది దాడి చేసి బరులను ధ్వంసం చేశారు. కొత్తూరు తాడేపల్లి మామిడి తోటను ట్రాక్టర్ పెట్టి దున్నించారు. ఇక అంబాపురం గ్రామ పరిధిలోని ఇన్నర్‌రింగ్, పాముల కాల్వ వద్ద బరులను సిద్ధం చేస్తూ ఏర్పాటు చేసిన గడ్డర్లను తొలగించారు. సంక్రాంతి సంబరాల పేరుతో జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, స్థల యజమానులకు నోటీసులు ఇస్తున్నామని పోలీసులు తెలిపారు. అయితే స్థల యజమానులు, బరులను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు మాత్రం ఇదంతా పండుగ ముందు పోలీసులు హడావుడేనని, అంతా తమ నాయకులు చూసుకుంటారని తేలికగా కొట్టి పడేస్తున్నారు.

ఆరోగ్య రంగానికి 6 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు బాబూరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కనీసం 6 శాతం నిధులు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య అధ్యక్షతన గురువారం ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య బడ్జెట్–ప్రజారోగ్యం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేట్ బీమా కంపెనీకి అప్పజెప్పకుండా ప్రభుత్వ రంగంలోనే బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ బకాయిలను వెంటనే తీర్చి ఆరోగ్యశ్రీని కొనసాగించాలని కోరారు. ఈసందర్భంగా సీపీఎం రాష్ట్ర నాయకుడు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో సరిపోయేంత సిబ్బంది, పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ.. మానవ వనరుల అభివృద్ధిలో ఆరోగ్యం పాత్ర చాలా ముఖ్యమన్నారు. చిన్న పిల్లల వైద్యం కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రి తరహాలో మన రాష్ట్రంలో చిన్న పిల్లల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.హనుమయ్య మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పడం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటైజేషన్ చేయడం తప్ప ఇంకొకటి కాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించి, పథకాన్ని కొనసాగించాలన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య, జిల్లా కార్యదర్శి జి.విజయ ప్రకాష్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.ఆంజనేయులు తదితరులు మాట్లాడారు.

తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): రాబోయే వేసవిలో నగరంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన దుర్గా ఘాట్, గాంధీ మున్సిపల్ హైస్కూల్, బందర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు త్రాగునీటి సరఫరాలో లోటు లేకుండా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. దీనికి స్థానిక కార్పొరేటర్లు, ఎమినిటీ కార్యదర్శులతో మాట్లాడి తగిన ప్రణాళిక సిద్ధం చేసి తనకు నివేదించాలని ఆదేశించారు. అనంతరం ఆయన గాంధీ మున్సిపల్ హైస్కూల్ దగ్గర ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్న క్యాంటీన్లను నోడల్ ఆఫీసర్లు నిత్యం పర్యవేక్షిస్తుండాలని, పారిశుద్ధ్య నిర్వహణలో లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన దుర్గ ఘాట్‌లో ఉన్న టాయిలెట్లను పరిశీలించి, ఆ ప్రదేశంలో నిత్యం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రధాన రోడ్లు, వీధుల్లో రోడ్లపై ఉన్న గుంతలను త్వరితగతిన పూడ్చివేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ క్వార్టర్స్‌కు చేరిన రాష్ట్ర కబడ్డీ జట్టు

విజయవాడస్పోర్ట్స్: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరుగుతున్న 50వ జాతీయ జూనియర్ కబడ్డీ పోటీల్లో రాష్ట్ర బాలుర జట్టు వరుస విజయాలతో దూసుకుపోతుంది. ఈ నెల ఎనిమిదో తేదీన ప్రారంభమైన ఈ పోటీల్లో రాష్ట్ర జట్టు పూల్–ఎఫ్ నుంచి పోటీకి దిగింది. గురువారం ఉదయం జరిగిన తొలి లీగ్‌లో చత్తీస్‌ఘడ్‌పై ఒక పాయింట్ తేడాతో గెలిచింది. అదేవిధంగా సాయంత్రం జరిగిన రెండో లీగ్‌లో తెలంగాణ జట్టుపై 16 పాయింట్ల ఆధిక్యాన్ని ప్రదర్శించింది. శుక్రవారం పూల్‌లోని బిహార్‌తో తలపడుతుంది. అయితే పూల్‌లోని రెండు జట్లను ఓడించిన రాష్ట్ర జట్టు ప్రీ క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. రాష్ట్ర జట్టును ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అభినందించారు.

నైపుణ్యం పెంచే పుస్తకాలపై ఆసక్తి

- వ్యక్తిత్వ వికాసానికి యువత పెద్ద పీట
- పుస్తక మహోత్సవంలో కెరీర్ గైడెన్స్ పుస్తకాలకు డిమాండ్
- 30 శాతం పుస్తకాలు వీటికి సంబంధించినవే

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువత తమలోని నైపుణ్యానికి పదును పెట్టే పుస్తకాలపై ఆసక్తి చూపుతోంది. ఉపాధి అవకాశాలకు డిగ్రీలతో పాటు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్ వంటి అంశాల్లో నైపుణ్యం పెంపొందించుకునేందుకు యువత ప్రయత్నిస్తోంది. అందుకు ఉపయోగపడే ఆయా అంశాలను సవివరంగా వివరించే పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. తద్వారా ఉపాధి అవకాశాలకు సంబంధించి ఎదురయ్యే పరీక్షల్లో తట్టుకునేందుకు సంసిద్ధమవుతున్నారు. గతంలో సంబంధిత కోర్సుల్లో డిగ్రీలు, వాటిల్లో మంచి మార్కులు ఉంటే ఉద్యోగాలు వచ్చేవి. ఆయా కంపెనీలు సైతం మార్కుల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసేవి. కానీ నేడు పరిస్థితి మారింది. పోటీ ప్రపంచంలో అందరికన్నా దీటుగా తమ ఉద్యోగులు ఉండాలనే సంకల్పంతో కంపెనీలు ఉపాధి కోసం తమ వద్దకు వచ్చే అభ్యర్థులకు విభిన్నమైన పరీక్షలను నిర్వహిస్తున్నాయి. మొత్తం పుస్తకాల అమ్మకాల్లో 30 శాతానికి పైగా ఈ తరహా పుస్తకాలే ఉంటున్నాయంటే వీటికి లభిస్తున్న ఆదరణ ఏపాటిదో అవగతం చేసుకోవచ్చు.

ఏఏ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి

35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో ఉపాధి అవకాశాలను ప్రభావితం చేసే పలు పుస్తకాలు లభిస్తున్నాయి. కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్, టీం వర్క్, సాఫ్ట్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ బిహేవియర్, బాడీ లాంగ్వేజ్, ఆటిట్యూడ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలు పుస్తక మహోత్సవ ప్రాంగణంలో యువతకు అందుబాటులో ఉన్నాయి. డెసిషన్ మేకింగ్, ప్లానింగ్, పర్సనల్ రిలేషన్స్ వంటి అంశాలపై కూడా పలు పుస్తకాలు ఇక్కడ లభిస్తున్నాయి. దేశీయ రచయితలతో పాటుగా పలువురు ప్రొఫెసర్లు, ప్రముఖ అంతర్జాతీయ రచయితలు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖ విశ్లేషకులు రచించిన పుస్తకాలు లభిస్తున్నాయి.

అందుబాటు ధరల్లో...

ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న యువతతో పాటుగా ఇప్పటికే ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారు కూడా తమ నైపుణ్యతను పెంచుకునేందుకు ఈ పుస్తకాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. వీటి ధరలు రూ.80 నుంచి ఏడెనిమిది వందల రూపాయల వరకూ పలుకుతున్నాయి. వాటితో పాటుగా డాక్టర్ బీవీ పట్టాభిరామ్, యండమూరి వీరేంద్రనాథ్ వంటి పలువురు వ్యక్తిత్వ వికాస నిపుణులు సైతం తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో చేసిన రచనలు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి.

యువత ఈ పుస్తకాలపై ఆసక్తి చూపుతున్నారు



గడిచిన దశాబ్ద కాలంగా యువతలో వివిధ స్కిల్స్‌ను పెంపొందించే పుస్తకాలకు మంచి డిమాండ్ కనిపిస్తుంది. అందువలనే చాలా మంది రచయితలు, పుస్తక ప్రచురణకర్తలు వాటిపై దృష్టి పెడుతున్నారు. ఇప్పటికే మంచి డిమాండ్ ఉన్న ఆంగ్ల రచయితల పుస్తకాలు, ప్రముఖ విద్యావేత్తల పుస్తకాలు మార్కెట్‌లో విస్తృతంగా లభిస్తున్నాయి. విద్యార్థులు, యువత తమకు కావాల్సిన ధరలో పుస్తకాలను కొనుక్కోవచ్చు.

–టి.మనోహర్‌నాయుడు, విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్

కెరీర్ గైడెన్స్ పుస్తకాలు తీసుకుంటున్నాం



వచ్చే కాంపిటేటివ్ పరీక్షలకు పనికి వచ్చే పుస్తకాలను కొనుగోలు చేస్తున్నాను. కెరీర్‌గైడెన్స్‌కు సంబంధించిన పుస్తకాలు చాలా ఉన్నాయి. ఇంగ్లిష్‌లో మంచి పుస్తకాలు కనిపిస్తున్నాయి. తెలుగులోనూ కొన్ని పుస్తకాలు ఇంట్రెస్ట్‌గా ఉన్నాయి. ఏమైనా ఈ పుస్తక మహోత్సవంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండటంతో మంచి పుస్తకాలను ఎంచుకోవటానికి అవకాశం లభిస్తుంది.

– కె.అవినాష్, డిగ్రీ విద్యార్థి

విశ్వంపై పరిశోధన ఆసక్తికరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా ప్రధాన వేదికపై రచయిత గంటా సత్యకుమార్ రచించిన 'విశ్వం' పుస్తకాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వంపై, అంతరిక్షంపై నేటి తరానికి దగ్గర చేయడానికి, మూఢనమ్మకాలను దూరం చేయడానికీ ఈ రచన ఉపయోగపడుతుందన్నారు. మనోహర్ నాయుడు సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి అధ్యక్షురాలు తేజస్విని పొడపాటి మాట్లాడుతూ విద్యార్థులకు ఖగోళం మీదా, విశ్వం మీదా ఆసక్తి కలిగేలా చేయాలన్నారు. విశ్రాంత అధ్యాపకుడు గుమ్మా సాంబశివరావు పుస్తకాన్ని పరిచయం చేస్తూ విశాల విశ్వానికి సంబంధించిన ఖగోళ వివరాలను సామాన్య పాఠకులకు అర్థమయ్యేలా ఈ రచన సాగిందన్నారు. కార్యక్రమాల సమన్వయకర్త గోళ్ల నారాయణరావు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు రేగుళ్ల మల్లికార్జునరావు, అధ్యాపకులు కె.రామకృష్ణ, గంటా రామప్రసాద్ ప్రసంగించారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని నేషనల్ బీసీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవ రాయుడు డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని కోరారు.

మహిళను అసభ్యకరంగా దూషించిన వ్యక్తిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను అసభ్యకరంగా దూషించడమే కాకుండా అడ్డు వచ్చిన అన్నను కొట్టిన యువకుడిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేటకు చెందిన జిల్లా వాణి(28) ఈ నెల 5వ తేదీ రాత్రి తన ఇంటి వద్ద ఉండగా, అదే ప్రాంతానికి చెందిన దూండీ, మరి కొంతమంది యువకులు మద్యం తాగి వచ్చి, వాణి ఇంటి ముందు నిల్చుని గొడవ పడుతుండటంతో ఆమె వారిని వారించింది. దీంతో వాణిని దూండీ అసభ్యకరంగా దూషించడమే కాకుండా అడ్డు వచ్చిన వాణి అన్నయ్యను కొట్టాడు. అంతేకాక పెట్రోల్ పోసి నిప్పు పెడతానని బెదిరించాడు. బాధితురాలు వాణి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అదనపు అంతస్తులు, నూతన పన్నులపై స్పెషల్ డ్రైవ్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన భవనాలు, అదనపు అంతస్తులపై కొత్తగా పన్నులు వేయాల్సిన ఆస్తులపై పన్నులు వేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగరంలోని లబ్బీపేట పరిసర ప్రాంతాల్లో ఆయన నూతన పన్నులు వేసే భవనాలను గురువారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఇంటి పన్నుల క్రమబద్ధీకరణ జరుగుతుందన్నారు. ఈ క్రమంలో వీఎంసీ రెవెన్యూ విభాగం, వార్డు అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలో నూతనంగా నిర్మించిన భవనాలకు, వాడుకలో ఉండి పన్నులు వేయని భవనాలకు, పాత భవనాలపై అదనపు అంతస్తులు వేసిన వారు నూతన పన్నులు నమోదు చేసుకోవాలని సూచించారు. భవన యజమానులు వీఎంసీ సిబ్బంది సహకరించాలన్నారు. డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సోలార్‌తో ఎన్నో ప్రయోజనాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సోలార్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, ప్రజలు తన నివాసాలపై సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకునే దిశగా ఆలోచన చేయాలని ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ సీఎస్‌వై కేశవచార్యులు అన్నారు. కేఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం సౌరశక్తి దాని ఉపయోగాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కేశవచార్యులు మాట్లాడుతూ సోలార్ పవర్‌ను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని, సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సోలార్ ప్లాంట్లను ప్రోత్సహిస్తూ సబ్సిడీ ఇస్తోందన్నారు. దీని ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చునన్నారు. సోలార్ సిస్టమ్‌లో విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలను ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.